క్లుప్తంగా

జంపాలకు కన్నీటి వీడ్కోలు

శ్రద్ధాంజలి ఘటించిన వివిధ రంగాల ప్రముఖులు



దుగ్గిరాల(తెనాలి): ప్రముఖ పసుపు వ్యాపారి జంపాల వెంకట కృష్ణారావు అంతిమయాత్ర బుధవారం నిర్వహించారు. రైలుపేటలోని ఆయన నివాసం నుంచి మహాప్రస్థానం వరకు కొనసాగింది. అక్కడ వెంకట కృష్ణారావు కుమారుడు శరత్‌కుమార్ అంతిమ సంస్కారాలు నిర్వహించారు. తొలుత వెంకట కృష్ణారావు భౌతికకాయాన్ని విశ్రాంత ఐఏఎస్ అధికారి, మాజీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ శ్రద్ధాంజలి ఘటించారు. తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సందర్శించి నివాళులర్పించారు. ఆయనతో పాటు తెనాలి మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు కఠారి హరీష్, సిరి కృష్ణ ఉన్నారు. దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, కంభంపాటి క్రాంతి, మాజీ సర్పంచి బాబూరావు, పోతినేని శ్రీనివాసరావు, వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్, గూడూరు వెంకట్రావు, పొన్నం సాంబశివరావు, నందం అబద్ధయ్య, పాటిబండ్ల కృష్ణప్రసాద్, కేశంనేని శ్రీఅనిత, అంచే మారుతీవరప్రసాద్ నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

ప్రకృతి సిబ్బందికి జీవామృతాల తయారీలో శిక్షణ



తెనాలి: ఖరీఫ్‌లో పంటల సాగుకు అవసరమైన ఘన, జీవామృతాల తయారీలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి కొల్లిపర మండల గ్రామం అత్తోటలోని ప్రకృతి వ్యవసాయ కేంద్రం 'భూమి భారతి'లో బుధవారం ఒకరోజు శిక్షణ నిర్వహించారు. తెనాలి డివిజనులో కొత్తగా నియమితులైన ప్రకృతి వ్యవసాయ సిబ్బంది 30 మంది పాల్గొన్నారు. వీరిలో 20 మంది వరకు మహిళలున్నారు. ప్రకృతి సాగుకు అవసరమైన ద్రవ జీవామృతాల్లో దశపర్ణి కషాయం (పది రకాల ఆకులతో కషాయం), ఆగ్నాస్త్రం తయారీలో అత్తోటకు చెందిన ప్రకృతి రైతు, భూమి భారతి వ్యవస్థాపకుడు యర్రు బాపన్న వీరికి శిక్షణనిచ్చారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగానికి చెందిన ఎన్ఎఫ్ఏ, సీఆర్పీ, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి



తెనాలిరూరల్: వాహన దారులందరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ట్రాఫిక్ ఎస్ఐ జె. శ్రీనివాస్ సూచించారు. తెనాలి వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కళాశాల సమీపంలోని మినీ లారీ స్టాండ్ వద్ద డ్రైవర్లతో ఆయన బుధవారం మాట్లాడారు. లారీలను ఫిట్‌నెస్ కోసం తీసుకెళ్లే సమయంలో పట్టణంలోకి వెళ్లకుండ వైకుంఠపురం, జగ్గడిగుంటపాలెం, చినరావూరు మీదుగా ఆర్టీఓ కార్యాలయానికి వెళ్లాల్సి ఉంటుందని చెప్పారు. అత్యవసరమైనప్పుడే హారన్‌వినియోగించాలని, మల్టీటోన్డ్ హారన్‌లు వాడకూడదన్నారు. పరిమితికి మించి అధిక లోడు మినీ లారీల్లో వేయకూడదని, లోడుపైన ప్రజలను ఎక్కించుకోకూడదని సూచించారు.

ఓటు హక్కుపై అవగాహన అవసరం

పిట్టలవానిపాలెం: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండాలని మండల తహసీల్దార్ కవిత విద్యార్థులకు సూచించారు. మండలంలోని అల్లూరు మంతెన సత్యనారాయణరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9,10 తరగతుల విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటు హక్కును నమోదు చేయించుకోవాలని సూచించారు. ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజాప్రతినిధులను ఎన్నుకునేందుకు వీలుంటుందని తెలిపారు. ఆర్ఐ అమానుల్లా ఖాన్, వీఆర్వో అలపర్తి వెంకట సుబ్బారావులు ఉన్నారు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు

రేపల్లె: వ్యక్తి మృతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అబ్దుల్ రజాక్ తెలిపారు. పట్టణంలోని 6వ వార్డుకు చెందిన పువ్వాడ రమేష్(40) మంగళవారం రాత్రి తన ఇంటిలోని బాత్రూమ్‌లో పడి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు రమేష్‌ను ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారన్నారు. మృతుని భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పేదల అభ్యున్నతే సీఎం జగన్ లక్ష్యం

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



మహిళకు సంక్షేమ బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

కొల్లిపర: నిరుపేదల అభ్యున్నతే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. బుధవారం కొల్లిపర గ్రామ పంచాయతీ పరిధిలోని సచివాలయం 2 పరిధిలో ఎస్టీ, ముస్లిం కాలనీ వద్ద నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున ఎమ్మెల్యే శివకుమార్‌ను ఘన స్వాగతం పలుకుతూ పూలమాలలతో సత్కరిస్తూ హారతులు పట్టారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. మహిళలను, వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తూ నాలుగేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించి సంక్షేమ బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తనకు తెలియజేయాలని సూచించారు. మురుగుకాలువలు నిర్మించాలని, విద్యుత్‌లో వోల్టేజి సమ్య ఉందని, వీదిలైట్లు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని స్థానికులు తెలపగా ఆయా సమస్యలను సకాలంలో పరిష్కరించాలని కోరారు.

పీఎండీఎస్ చేలో వరి సాగుకు శ్రీకారం



వేర్లను భూమిలో ఉంచేందుకు పైన పైరు కోత

వల్లభాపురం(తెనాలి): కొల్లిపర మండల గ్రామం వల్లభాపురంలో ప్రకృతి వ్యవసాయం విధానాన్ని బుధవారం క్షేత్రస్థాయిలో నిర్వహించారు. గ్రామానికి చెందిన దాసరి రత్నభాస్కర్ పంట పొలంలో అర ఎకరం విస్తీర్ణంలో పీఎండీఎస్ విధానంలో భాగంగా వేసిన 30 రకాల విత్తనాలు 65 రోజుల వ్యవధి పూర్తయింది. దీనితో ఆ విస్తీర్ణంలో పెరిగిన పంట వేర్లను భూమిలోనే ఉంచి, పైన పైరును మాత్రం కోశారు. అనంతరం భూమిని ఏమాత్రం దున్నకుండా బీజామృతంతో శుద్ధి చేసిన బీపీటీ వరి విత్తనాలను, తాడు సహాయంతో జీరో టిల్లేజ్ పద్ధతిలో చల్లారు. అనంతరం 1500 కిలోల ఘనజీవామృతాన్ని వేశారు. కార్యక్రమంలో వల్లభాపురం, మున్నంగి యూనిట్ ఎస్‌డీఏ సుధారాణి, ఎన్ఎఫ్ఎంటీ నాగకృష్ణ, ఐసీఆర్‌పీఎస్, రైతులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి

కొల్లిపర: సైబర్ నేరగాళ్లపై దుకాణదారులు, వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఆర్ వీంద్రరెడ్డి సూచించారు. మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో ప్రధాన కూడళ్లలో బుధవారం రైటర్ డి.శ్యామ్ కుమార్, పోలీస్ సిబ్బందితో కలిసి సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఎక్కువ శాతం సైబర్ నేరాలు పెరుగుతునాయి దానిలో భాగంగా నేరలపై అవగాహన కలిగిండాలన్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ పే వేయిస్తామని డబ్బు ఇవ్వాలంటూ వస్తే తిరస్కరించాలన్నారు. అనుమానిత వ్యక్తులు వస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు.

వృద్ధురాలిని అటకాయించి బ్యాగ్‌తో పరారైన యువకులు

తెనాలిరూరల్: వృద్ధురాలిని అటకాయించి ఆమె వద్ద ఉన్న బ్యాగు లాక్కుని గుర్తు తెలియని యువకులు పరారైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ రామలింగేశ్వరపేటకు చెందిన 62 ఏళ్ల గూడూరి సంపూర్ణ ఈ నెల 14వ తేదీన నందులపేటలోని దంత వైద్యశాలకు తన సైకిల్‌పై వెళ్లింది. తిరుగు ప్రయాణంలో నాజరుపేట కాంచనమాల టవర్స్ వీధిలో రామలింగేశ్వరపేట మూడు బొమ్మల సెంటరుకు వెళుతుండగా వెనుక నుంచి వచ్చిన గుర్త తెలియని యువకులు ఆమెను అటకాయించారు. సైకిల్ ముందు భాగంలోని బుట్టలో ఉన్న బ్యాగును లాక్కుని పరారయ్యారు. బాధితురాలు బుధవారం పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వన్‌టౌన్ సీఐ కె. చంద్రశేఖర్ తెలిపారు.

పేదలకు అన్నదానం



తెనాలిఅర్బన్: శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి గౌరవ అధ్యక్షుడు కాసా రామశ్రీను సహకారంతో రైల్వేస్టేషన్ రోడ్డులోని అన్నదాన కేంద్రం వద్ద బుధవారం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను, సభ్యులు షేక్ కాలేషా, షేక్ మీరావలి, పాశం వెంకటేష్, ఎన్ఆర్‌కె శర్మ, తుల్లిమిల్లి చంటి, ఆషా, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

ఇద్దరు డీలర్లపై 6ఏ కేసు నమోదు



సజ్జావారిపాలెంలో ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

నిజాంపట్నం: విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిర్వహించిన దాడులలో ఎరువులు స్వాధీనం చేసుకుని డీలర్లపై 6ఏ కేసు నమోదు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ ఆదేశాల మేరకు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.ఈశ్వరరావు పర్యవేక్షణలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బాపట్ల జిల్లాలోని నిజాంపట్నం, నగరం మండలం సజ్జవారిపాలెం గ్రామాలలోని ఎరువుల దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సజ్జవారిపాలెంలోని వాసవీ ఫెర్టిలైజర్స్, కైలాష్ ఫెర్టిలైజర్స్ దుకాణాలలో స్టాక్ బోర్డు, స్టాక్ రిజిస్టర్, బిల్లులు సక్రమంగా లేకుండా వ్యాపారం చేస్తున్నట్లు గుర్తించారు. ఈ రెండు షాపులలో మొత్తం 11.850 మెట్రిక్ టన్నుల ఎరువులు రూ.2,57,700 విలువ కలిగిన ఎరువులను స్వాధీనం చేసుకుని ఇరువురు డీలర్లపై 6ఏ కేసు నమోదు చేయాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. దాడులు నిర్వహించిన వారిలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (వ్యవసాయ) అధికారి జె.వాసంతి, సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం .రామచంద్రయ్య, స్థానిక వ్యవసాయశాఖ అధికారులు ఉన్నారు.

ఇసుక లారీ సీజ్

తెనాలిరూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు సీజ్ చేశారు. కొల్లిపర మండలంలో ఇసుక అక్రమంగా తరలుతోందన్న సమాచారంతో తెనాలి ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం తమ సిబ్బందితో కలసి బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఎటువంటి అనుమతులు లేకుండ ఇసుకను తరలిస్తున్న లారీని గుర్తించారు కేసు నమోదు చేయడంతో పాటు వాహనాన్ని సీజ్ చేసి కొల్లిపర పోలీసులకు అప్పగించారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

మండల ప్రత్యేకాధికారి సుధాకర్



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి, పరిశ్రమల శాఖ డీడీ సుధాకర్

తాడికొండ: మండలంలో ఇళ్ల నిర్మాణాలు, అభివృద్ధి పనులు వేగవంతంగా చేయాలని తాడికొండ మండల ప్రత్యేకాధికారి, పరిశ్రమల శాఖ డీడీ సుధాకర్ సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాల దశల వారీ వివరాలు సేకరించి లబ్ధిదారులకు అవసరాలను గుర్తించి అవసరమైతే అదనపు రుణాలు అందించి త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలన్నారు. మండలంలోని తాగునీటి అవసరాలు తీర్చేందుకు జల్‌జీవన్ మిషన్ ద్వారా జరుగుతున్న పనులు సకాలంలో పూర్తి చేయాలని కోరారు. సచివాలయాలు, ఆర్‌బీకేలు నిర్మాణం పూర్తిచేసి ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని చెప్పారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అత్తోట దీప్తి, ఈఓఆర్డీ వెంకటేశ్వర్లు, హౌసింగ్ డిఈ పి.సీతారామయ్య, పీఆర్, హౌసింగ్ ఏఈలు శ్రీనివాస్, ఓబుల్ రెడ్డి పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

బాపట్ల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఈనెల 21వతేదీన ఖాజీపాలెంలో చేపడుతున్న జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోన రఘుపతి సూచించారు. జాబ్‌మేళా కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా కోన మాట్లాడుతూ ప్రముఖ కంపెనీలైన గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్, రిలయన్స్ జియో, ఇన్ఫోకామ్ లిమిటెడ్, మెడ్‌ప్లస్ ఫార్మసీ, అపోలో ఫార్మసీ, యాక్సిస్ బ్యాంక్, ఐ.సి.ఐ.సి.ఐ.బ్యాంక్, హీరో మోటో కార్పొరేషన్, ముత్తూట్ ఫైనాన్స్, మాల్ టెక్ సొల్యూషన్స్ కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొంటాయని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శివప్రసాద్, కిషోర్ కుమార్, రమేష్‌బాబు, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు. వివరాలకు 9988853335 ,9032384374, 8555901198 నంబర్లలో సంప్రదించాల్సిందిగా సూచించారు.

వ్యభిచార గృహంపై దాడి

గుంటూరు రూరల్: వ్యభిచార గృహంపై పోలీసులు దాడిచేసి విటులు, నిర్వాహకులు, మహిళల్ని అదుపులోకి తీసుకున్నారు. నగరాలులోని పట్టాభిసీతారామయ్య నగర్‌లో ఓ నివాసంలో వ్యభిచారం నిర్వహిస్తున్నారని సమాచారంతో దాడి చేసినట్లు సీఐ శ్రీనివాసరావు చెప్పారు. ఇద్దరు నిర్వాహకులు, విటుడు, గృహం నిర్వహిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

స్వచ్ఛ గుంటూరులో భాగస్వామ్యం కావాలి

నగర కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: స్వచ్ఛ గుంటూరులో నగర ప్రజలంతా భాగస్వామ్యులు కావాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఒక ప్రకటనలో కోరారు. స్వచ్ఛ సర్వేక్షణ్- 2023లో నగరానికి మెరుగైన ర్యాంక్ వచ్చేలా నగరపాలక సంస్థ సంస్థాగతంగా మెరుగైన పారిశుద్ధ్య పనులు చేపడుతోందని పేర్కొన్నారు. ప్రజలు కూడా తమ అభిప్రాయాల్ని ఆన్‌లైన్‌లో ప్రత్యేక యాప్ ద్వారా తెలియచేసి నగరానికి మెరుగైన ర్యాంక్ రావడంలో భాగస్వాములు కావాలని ఆమె కోరారు. జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వం నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షణ్- 2023లో మెరుగైన ర్యాంక్ వచ్చేందుకు నగరపాలక సంస్థ తరపున 206 వార్డు సచివాలయాల పరిధిలో ఇంటింటి నుంచి చెత్త సేకరణకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని పేర్కొన్నారు. ఈ-ఆటోలు కూడా అందుబాటులోకి వచ్చినందున నూరు శాతం సేకరణ చేయడానికి కృషి చేస్తున్నామని వెల్లడించారు. నగర సుందరీకరణలో భాగంగా మెయిన్ రోడ్ల డివైడర్లు, ఆర్ఓబీలు, ఆర్‌యూబీల వద్ద పెయింటింగ్ చేయించామని తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీల్లో గుంటూరు నగరానికి మెరుగైన ర్యాంక్ వచ్చేందుకు నగర ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా ప్రజలు నేరుగా ద్వారా ఫోన్‌కి వచ్చే ఓటీపీని ఇంటి వద్దకు వచ్చే నగరపాలక సంస్థ వలంటీర్లు, కార్యదర్శులకు తెలపడంతో పాటు అభిప్రాయాల్ని తెలియజేయాలని కమిషనర్ కోరారు. ఓటీపీపై ఎటువంటి అపోహలకు గురికావద్దని ఆమె సూచించారు. ప్రజారోగ్య కార్మికులు, కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లు తమ పరిధిలోని ప్రజలకు స్వచ్ఛ సర్వేక్షణ్, యాప్‌ల వినియోగం, ఓటీపీ అంశాలపై అవగాహన కలిగించాలని కమిషనర్ ఆదేశించారు.

యూనిఫాంతో పాఠశాలలకు రావాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులంతా ప్రతి రోజూ యూనిఫాం, బూట్లు ధరించి హాజరుకావాలని గుంటూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి పి. వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మార్కెట్ సెంటర్‌లోని హిందూ హైస్కూలును బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న విద్యాకానుక ద్వారా ఉచితంగా అందజేసిన సామగ్రిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమయపాలన పాటించి, యూనిఫాం, బూట్లు, సాక్సులు, టైం, బెల్టు ధరించి హాజరయ్యే విధంగా పర్యవేక్షించాలని ఉపాధ్యాయుల్ని ఆదేశించారు.

అంతర్జాతీయ రైఫిల్ షూటింగ్‌లో కేఎల్‌యూ విద్యార్థికి కాంస్యం



మంగళగిరి: ఈనెల 14వ తేదీ నుంచి 25వ తేదీవరకు దక్షిణ కొరియాలోని చాంగ్ వోన్‌లో జరుగుతున్న జూనియర్ ప్రపంచ రైఫిల్ షూటింగ్ చాంపియన్ షిప్‌లో నగర పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ విద్యార్థికి కాంస్యపతకం లభించింది. యూనివర్సిటీ క్రీడా విభాగం అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరికిషోర్ బుధవారం వివరాలు వెల్లడించారు. యూనివర్సిటీలో సీఎస్ఈ ఐటీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న మద్దినేని ఉమా మహేష్ ఎయిర్ రైఫిల్ షూటింగ్‌లో కాంస్యపతకం సాధించినట్లు తెలిపారు. పతకం సాధించిన ఉమా మహేష్‌ను యూనివర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో.వీసీ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావులతో పాటు పలువురు ప్రొఫెసర్లు, విద్యార్థులు అభినందించారు.

పారదర్శకంగా ఇంటింటి సర్వే

తహసీల్దారు నాంచారయ్య



కొల్లిపర: ఓటర్ల జాబితాలో పొరపాట్లు లేకుండా పక్కాగా జాబితా సిద్ధం చేసేందుకు ఈనెల 21 నుంచి ఆగస్టు 21 వరకు మండలంలోని బీఎల్ఓలు ఇంటింటా సర్వేను పాదర్శకంగా నిర్వహించాలని తహసీల్దారు జి.నాంచారయ్య తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ఓటర్ల జాబితాలతో ఈనెల 21 నుంచి ఆగస్టు 21 వరకు ప్రతి ఇంటికీ బీఎల్ఓలు వెళ్లి , ఓటర్లు తమ పేర్లు, ఆధార్ నంబర్లు, ఇంటి పేర్లు తదితర వివరాలు జాబితాలో సరిగా ఉన్నవీ లేనిదీ సరి చూసుకోవాలన్నారు. ఈ సర్వే కార్యక్రమం ద్వారా కొత్త ఓటర్ల నమోదుతో పాటు తొలగింపులు, చేర్పులు, వివరాల మార్పులు కూడా చేపట్టాలన్నారు. ఓటర్ల నమోదులో ఎలాంటి రాజకీయ పక్షపాతం లేకుండా 18ఎళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. ఎక్కడైనా అర్హత లేని వారికి ఓట్లు ఉంటే రాజకీయ పార్టీలు ఫిర్యాదులు అందిస్తే అలాంటి ఓట్లను పూర్తి స్థాయిలో విచారణ జరిపి నిజమైతే తొలిగించాలని చెప్పారు. ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓట్లు ఉన్నట్లయితే ఆధారాలతో సహా ఆర్డీఓ కార్యాలయానికి పిర్యాదు చేస్తే విచారణ చేసి , ఒక చోట ఓటు హక్కు ఉంచి , మరోచోట తొలగించడం జరుగుతుందన్నారు. ఓటర్లు ఓటర్ల సర్వేకు సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసరావు, విఆర్వోలు, బీఎల్ఓలు తదితరలు పాల్గొన్నారు.

వైద్యులు రోగులకు అందుబాటులో ఉండాలి

ఎమ్మెల్యే శివకుమార్



రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

కొల్లిపర: వైద్య శాలల్లో వైద్యులు నిరంతరం రోగులకు అందుబాటులో ఉంటూ సరైన సమయంలో వైద్య సేవలు అందిస్తూ ప్రభుత్వ వైద్యశాలపై ప్రజలకు ఉన్న అపోహలు తొలగించేలా వైద్యులు , సిబ్బంది కృషి చేయాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. బుధవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్ని హాస్పటల్ సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఎంత మంది వైద్యులు ఉన్నారు, రోజు ఓపి లో ఎంత మంది రోగులు వస్తున్నారు. వైద్యులు ఎంత సమయం వరకు వైద్యశాలలో ఉంటున్నారు , రోగులకు సంబందించిన మందులు ఉన్నాయా, మూలిక వసతులు వంటి వాటి గురించి పూర్తి స్థాయిలో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యశాలలో వైద్యులు సాయంత్రం 5గంటల వరకు ఉండాలన్నారు. ఆ తరువాత అత్యవసరమైన పరిస్థితిలో రోగులను పరీక్షించేందుకు అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం రూ.8.50 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న హాస్పటల్ భవన నిర్మాణ పనులను పరిశీలించి , పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి, అభివృద్ధి కమిటీ చైర్మన్ బొమ్మారెడ్డి ప్రభాకరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక స్థల సేకరణకు సర్వే



వివరాలను పరిశీలిస్తున్న అధికారులు

కోళ్ళపాలెం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని కోళ్లపాలెంలో శ్మశాన వాటిక స్థల సేకరణకు సంబంధించి రెవెన్యూ అధికారులు బుధవారం సర్వే నిర్వహించారు. ఇటీవల జరిగిన గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా గ్రామ వాసులు శ్మశాన వాటిక సమస్యను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున దృష్టికి తీసుకు వచ్చారు. ఎన్నో ఏళ్లుగా శ్మశాన వాటిక లేకపోవడంతో రహదారుల వెంట ఖననం చేయాల్సి పరిస్థితి నెలకొందని తెలిపారు. స్పందించిన మంత్రి నాగార్జున స్థల సేకరణ చేపట్టాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మండల సర్వేయర్ బొర్రా శ్రీనివాసరావు గ్రామంలో ప్రభుత్వ భూములకు సంబంధించి సర్వే చేపట్టారు. ఆయన వెంట వీఆర్ఓ వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు నీలా నాగరాజు, పంచాయతీ వార్డు సభ్యులు, సంఘ పెద్దలు ఉన్నారు.

సంచారజాతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

సంచార జాతుల కార్పొరేషన్ చైర్మన్ పెండ్రా వీరన్న



పెండ్రా వీరన్న ను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

బాపట్ల: సంచారజాతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని సంచార జాతుల రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పెండ్రా వీరన్న పేర్కొన్నారు. బాపట్లలోని దివ్యాంగుల సంక్షేమ కార్యాలయంలో బుధవారం సమావేశంలో పెండ్రా వీరన్నను సన్మానించారు. ఈసందర్భంగా పెండ్రా వీరన్న మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంచారజాతుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఫోర్టిఫైడ్ రైస్‌పై అవగాహన



ఫోర్టిఫైడ్ రైస్‌ను పంపిణీ చేస్తున్న సీడీపీఓ సులోచన తదితరులు

మంగళగిరి: నగర పరిధిలోని కాజ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఫోర్టిఫైడ్ రైస్‌పై అవగాహన కల్పించారు. పౌష్టికాహార లోపం అధిగమించేందుకు గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ఫోర్టిఫైడ్ రైస్ పంపిణీ చేస్తున్నట్లు మంగళగిరి సీడీపీఓ ఎ.సులోచన తెలిపారు. ఫోర్టిఫైడ్ రైస్‌లో ఐరన్‌తో పాటు బలవర్ధకమైన విటమిన్లు ఉంటాయని చెప్పారు. వంద కిలోల బియ్యంలో ఒక కిలో సూక్ష్మ పోషకాలు కలిగిన ఫోర్టిఫైడ్ రైస్‌ను కలిపి పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ కె.సరిత, సూపర్ వైజర్ జి.కుమారి పాల్గొన్నారు.

పోలింగ్‌బూత్‌ల పరిశీలన



పోలింగ్‌బూత్ వివరాలు పరిశీలిస్తున్న అధికారులు

రేపల్లె రూరల్: రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గంలో ఓటర్ల జాబితా తయారు చేయటంతో పాటు పోలింగ్ బూత్‌ల ఏర్పాటుకు అవసరమైన కేంద్రాలను సిద్ధం చేస్తున్నట్లు రేపల్లె ఆర్డీఓ జగన్నాథం పార్థసారథి తెలిపారు. పట్టణంలోని పలు పోలింగ్ బూత్‌లను బుధవారం ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలు ప్రస్తుతం ఉన్న స్థితితో పాటు, ఆయా కేంద్రాలలో ఏర్పాటు చేయాల్సి న మలిక సదుపాయాలను పరిశీలించామన్నారు. నియోజకవర్గంలో ఏర్పాటు చేసే కేంద్రాల వివరాలపై ఉన్నతాధికారులకు నివేదికను పంపటం జరుగుతుందన్నారు. మున్సిపల్ కమిషనర్ విజయసారధి, సీనియర్ అసిస్టెంట్ విజయేంద్ర తదితరులు పాల్గొన్నారు.